అక్రమ నిర్బంధానికే సాయిబాబా బలి

- తొమ్మిదేండ్లు జైలుపాలు.. ఆ కుటుంబం క్షోభ వర్ణనాతీతం
- ప్రొఫెసర్ సాయిబాబాకు కేటీఆర్, హరీశ్‌రావు ఘన నివాళి
- గన్‌పార్క్ వద్ద భౌతికదేహం ఉంచేందుకు అనుమతి నిరాకరణ
- అంబులెన్స్‌లోనే శ్రద్ధాంజలి ఘటించిన పలువురు నేతలు
- భౌతిక దేహాన్ని గాంధీ వైద్య కళాశాలకు అప్పగించిన కుటుంబం

మౌలాలిలో ప్రొఫెసర్ సాయిబాబా పార్థివ దేహం వద్ద నివాళులర్పిస్తున్న హరీశ్‌రావు

గన్‌పార్క్ వద్ద నివాళులర్పిస్తున్న పౌర సంఘాల నేతలు

మల్కాజిగిరి, అక్టోబర్ 14: ప్రొఫెసర్ సాయిబాబాపై అక్రమ కేసులుపెట్టి జైలు పాలు చేశారని మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. మౌలాలిలో ప్రొఫెసర్ సాయిబాబా పార్థివ దేహంపై బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు, హరీశ్‌రావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. ప్రొఫెసర్ సాయిబాబా దివ్యాంగుడైనా తొమ్మిదేండ్లు అక్రమంగా జైలులో ఉంచారని విమర్శించారు. ఢిల్లీ యూనివర్సిటీ ఉద్యోగం నుంచి తొలగించారని తెలిపారు. చివరికి ఆయనను సుప్రీంకోర్టు నిర్దోషిగా తేల్చిందని చెప్పారు. ఆ సమయంలో ఆయన కుటుంబం మానసిక క్షోభ అనుభవించిందని, ఆర్థికంగా ఇబ్బందులు పడ్డారని ఆవేదన వ్యక్తంచేశారు. సుప్రీంకోర్టు తీర్పుతో నిర్దోషిగా విడుదలైన సాయిబాబా కుటుంబంతో ఆనందంగా గడుపుతున్న సమయంలో మృత్యువు ఆయనను పొట్టనపెట్టుకున్నదని పేర్కొన్నారు. సాయిబాబాకు నివాళులర్పించిన వారిలో ఎమ్మెల్సీలు దేశపతి, కోదండరాం, ఎమ్మెల్యేలు అరికెపూడి గాంధీ, మాధవరం కృష్ణారావు, నాయకులు పెద్ది సుదర్శన్, దేవీప్రసాద్, ఎర్రోళ్ల శ్రీనివాస్, మల్లేపల్లి లక్ష్మయ్య తదితరులు ఉన్నారు.

ప్రొఫెసర్ సాయిబాబా పార్థివ దేహం వద్ద విలపిస్తున్న భార్య వసంత

గన్‌పార్క్ వద్ద తీవ్ర ఉద్రిక్తత..

గన్‌పార్క్ వద్ద కొద్దిసేపు సంతాప సమావేశం ఏర్పాటు చేస్తామని కుటుంబసభ్యులు, అభిమానులు కోరగా.. పోలీసులు అనుమతించలేదు. దీంతో సాయిబాబా అభిమానులు, పోలీసుల మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. ఒకానొక దశలో తోపులాట వరకూ వచ్చింది. తాము ప్రభుత్వ పెద్దలతో మాట్లాడామని, మంత్రులు కూడా అనుమతి ఇచ్చారని చెప్పినా పోలీసులు అనుమతించలేదు. అంబులెన్స్‌లోని సాయిబాబా పార్థివదేహాన్ని దించేందుకు కూడా ఒప్పుకోలేదు. దీనిపై పౌర హక్కుల, ప్రజా సంఘాల నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్యాన్ని, పౌర హక్కులను కాపాడతామని చెప్పిన కాంగ్రెస్ నాయకులు.. ఇలా తమ హక్కులను హరించడం ఏమిటని నిలదీశారు. అంబులెన్స్‌లోనే ప్రొఫెసర్ పార్థివ దేహానికి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ క్రమంలో అక్కడికి చేరుకున్న సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ మీడియాతో మాట్లాడారు.. పుస్తకాలు కాకుండా సమాజాన్ని చదివేవారు మేధావులని అన్నారు. సాయిబాబా అలాంటి వ్యక్తి అని కొనియాడారు.

భౌతికదేహం గాంధీ వైద్య కళాశాలకు అప్పగింత

బన్సీలాల్‌పేట్: సికింద్రాబాద్‌లోని గాంధీ వైద్య కళాశాల అనాటమీ విభాగానికి ప్రొఫెసర్ సాయిబాబా (57) భౌతికదేహాన్ని సోమవారం అప్పగించారు. ప్రజా సంఘాల నాయకులు, అభిమానులు జోహార్ సాయిబాబా సార్ అంటూ నినాదాలు చేస్తూ ర్యాలీగా తరలివచ్చారు. మౌలాలిలోని స్వగృహం నుంచి సాయిబాబా భౌతికదేహాన్ని వాహనంలో కుటుంబసభ్యులు గాంధీ వైద్య కళాశాల వద్దకు తరలించారు. ఈ సందర్భంగా కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కే రవిశేఖర్‌రావు మాట్లాడుతూ వైద్య విద్యార్థుల పరిశోధనకు ఉపయోగపడేందుకు ప్రొఫెసర్ సాయిబాబా భౌతికదేహాన్ని అప్పగించి, ఎందరికో ఆదర్శంగా నిలిచిన వారి కుటుంబసభ్యులకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సాయిబాబా సోదరుడు రాందేవ్, భార్య వసంత, కుమార్తె మంజీర, సీపీఐ కార్యదర్శి నారాయణ, పౌర హక్కుల సంఘం అధ్యక్షుడు ప్రొఫెసర్ లక్ష్మణ్, ప్రొఫెసర్ కాశీం, ప్రొఫెసర్ సూరేపల్లి సుజాత, జర్నలిస్టులు పాశం యాదగిరి, వేణుగోపాల్, పాండురంగారావు, చిక్కుడు ప్రభాకర్, గాదె ఇన్నయ్య, అంబటి నాగయ్య, సంధ్య, సజయ, పద్మకుమారి, అంజమ్మ, మీరా సంఘమిత్ర, విరసం అధ్యక్షుడు ఏ కృష్ణ, కార్యదర్శి రివేరా, పాణి, అమ్మ నేత్ర, అవయవ దాన ప్రోత్సాహకుల సంఘం అధ్యక్షురాలు గుత్తా జోత్సన, ఉద్యమకారుల జేఏసీ చైర్మన్ ఎస్ యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

సాయిబాబాది సర్కారీ హత్యే

సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తికి సీపీఐ నారాయణ లేఖ

హైదరాబాద్, అక్టోబర్ 14 (నమస్తే తెలంగాణ): పౌరహక్కుల ఉద్యమకారుడు, ఢిల్లీ విశ్వ విద్యాలయం మాజీ ప్రొఫెసర్ జీఎన్ సాయిబాబా మరణం సర్కారీ హత్యేనని సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కే నారాయణ ఆరోపించారు. హైదరాబాద్‌లోని సీపీఐ రాష్ట్ర కార్యాలయం(మగ్దూంభవన్)లో సోమవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో పార్టీ ఏపీ కార్యదర్శి కే రామకృష్ణతో కలిసి ఆయన మాట్లాడారు. ప్రొఫెసర్ సాయిబాబా నిర్దోషి అని తేల్చిన న్యాయస్థానం, పదేళ్లపాటు ఆయనను జైలులో మగ్గేలా చేసిన దోషులెవరో తేల్చాలని కోరారు. ఈ మేరకు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తికి సీపీఐ తరపున లేఖ రాశారు. సుప్రీంకోర్టులో కేసు కూడా దాఖలు చేయనున్నట్టు వెల్లడించారు. సాయిబాబాకు జరిగిన అన్యాయంపై ప్రజాతంత్రవాదులు, మేధావులతో పాటు వివిధ వర్గాల ప్రజలను సమీకరించి పెద్దఎత్తున చర్చను లేవదీయనునట్టు తెలిపారు. కేంద్రం హోంమంత్రిగా ఉన్న అమిత్ షా 2026 నాటికి అర్బన్ నక్సలైట్లను ఏరివేస్తామని ప్రకటించడాన్ని సీపీఐ ఖండిస్తున్నదని తెలిపారు. 'ఉపా' చట్టాన్ని సమీక్షించాలని ఏపీ రాష్ట్ర కార్యదర్శి నారాయణ డిమాండ్ చేశారు.

నేడు కొత్త టీచర్లకు పోస్టింగులు

హైదరాబాద్, అక్టోబర్ 14 (నమస్తే తెలంగాణ) : ఇటీవల కొత్తగా నియమితులైన 10,006 మంది టీచర్లకు మంగళవారం ఆఫ్‌లైన్‌లో పోస్టింగులు ఇవ్వనున్నారు. వారు గత గురువారమే డీఈవో కార్యాలయాల్లో రిపోర్ట్ చేయగా వారికి కేటాయించిన జిల్లాలో పోస్టింగులు ఇవ్వాలని విద్యాశాఖ అధికారులు ఆదేశాలు జారీ చేశారు. బదిలీ అయిన ఉపాధ్యాయులను బుధవారంలోగా రిలీవ్ చేయాలని డీఈవోలకు సూచించారు. బుధవారం కొత్త టీచర్లకు కౌన్సెలింగ్ అనంతరం వెంటనే విధుల్లో చేరేలా చర్యలు చేపట్టాలని నిర్దేశించారు.

గ్రూప్-1 మెయిన్స్ హాల్‌టికెట్లు విడుదల

హైదరాబాద్, అక్టోబర్ 14(నమస్తేతెలంగాణ) : గ్రూప్-1 మెయిన్స్ హాల్‌టికెట్లను టీజీపీఎస్సీ సోమవారం విడుదల చేసింది. ఈ మేరకు అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచింది. అభ్యర్థులు టీజీపీఎస్సీ రిజిస్ట్రేషన్ ఐడీ నంబర్, పుట్టిన తేదీ ఎంటర్ చేసి హాల్‌టికెట్లను పొందవచ్చని వెల్లడించింది. ఈ నెల 21 నుంచి 27 వరకు జరుగనున్న మెయిన్స్‌కు 31,382 మంది హాజరుకానున్నారు.

అద్దెల కోసం బిల్డింగ్‌లకు తాళాలు

బకాయిల జాప్యానికి యజమానుల నిరసన

హైదరాబాద్, అక్టోబర్14 (నమస్తే తెలంగాణ) : ప్రభుత్వం 9 నెలలుగా అద్దెలు చెల్లించకపోవడం పై రాష్ట్ర గురుకుల విద్యాలయ ప్రైవేట్ భవనయాజమాన్య సంఘం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నది. ప్రభుత్వ వైఖరికి నిరసనగా నేడు బిల్డింగ్‌లకు తాళాలు వేయాలని నిర్ణయించింది. ఈ మేరకు సంఘం అధ్యక్షుడు దేవేందర్‌రెడ్డి, కార్యదర్శి బండి కుమారస్వామి, కోశాధికారి సీహెచ్ కొండల్‌రెడ్డి సోమవారం ఒక సంయుక్త ప్రకటనలో వెల్లడించారు. ప్రభుత్వం బకాయిలన్నింటి నీ చెల్లించిన వెంటనే తాళాలు తీయాలని భవన యజమానులకు పిలుపునిచ్చారు.

ఆటోడ్రైవర్ల ఆత్మహత్య

- ఆర్థిక ఇబ్బందులు తాళలేక..
- నిజామాబాద్ జిల్లాలో నదిలో దూకి బలవన్మరణం

రెంజల్/నవీపేట, అక్టోబర్ 14 : ఉపాధి లేక.. ఆర్థిక ఇబ్బందులు తాళలేక నిజామాబాద్ జిల్లాలో ఇద్దరు ఆటో డ్రైవర్లు ఆత్మహత్య చేసుకున్నారు. వేర్వేరుగా జరిగినప్పటికీ ఇద్దరు గోదావరిలో దూకి బలవన్మరణానికి పాల్పడ్డారు. బోధన్ మండలం ఖండ్‌గాం గ్రామానికి చెందిన మీసారె లక్ష్మణ్ (26)కు భార్య, ఇద్దరు పిల్లలు. ఆటో నడుపుతూ కుటుంబాన్ని నెట్టుకొస్తున్న లక్ష్మణ్‌కు కొన్నాళ్లుగా కష్టాలు మొదలయ్యాయి. 'మహాలక్ష్మి' పథకం కారణంగా ఆటో సరిగా నడవడం లేదు. మరోవైపు, ఆర్నెళ్ల క్రితం భార్య మృతి చెందింది. దీంతో లక్ష్మణ్ ఇద్దరు పిల్లలతో కలిసి రెంజల్ మండలం సాటాపూర్‌లో నివాసముండే బావ గంగాధర్ ఇంటి వద్దే ఉంటున్నాడు. ఆటో నడువక ఆర్థిక ఇబ్బందులు తలెత్తడం, భార్య దూరం కావడంతో జీవితంపై విరక్తి చెందిన లక్ష్మణ్ ఈనెల 12న దసరా రోజు ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. కందకుర్తి సమీపంలోని గోదావరి నదిలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. లక్ష్మణ్ జాడ లేకపోవడంతో అతని బావ గంగాధర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా, మిస్సింగ్ కేసు నమోదు చేశారు. ఈక్రమంలో గోదావరి వద్ద వంతెనపై బైక్, చెప్పులు లభించాయి. గజఈతగాళ్లను రంగంలోకి దింపి గాలించగా, సోమవారం లక్ష్మణ్ మృతదేహం లభ్యమైంది. నవీపేట మండలం అనంతగిరికి చెందిన జీవన్‌రెడ్డి(57)కి భార్య లావణ్య, కూతురు శోభిత, కుమారుడు సంతోష్‌రెడ్డి ఉన్నారు. బతుకు దెరువు కోసం పదేండ్ల క్రితం నిజామాబాద్‌కు వెళ్లిన జీవన్‌రెడ్డి.. ఫైనాన్స్‌లో ఆటో కొని నడుపుతూ కుటుంబాన్ని పోషిస్తున్న ఆయన నాలుగేళ్ల క్రితం అప్పు చేసి కూతురి పెండ్లి జరిపించాడు. కొద్ది రోజులుగా ఆటో నడవక ఆదాయం తగ్గింది. ఫైనాన్స్ వ్యాపారులు, కూతురి పెండ్లికి చేసిన అప్పులు తిరిగి చెల్లించాలని ఒత్తిడి చేయడంతో మనోవేదనకు గురయ్యాడు. ఆదివారం ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఆయన.. వద్ద గోదావరి నదిలో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు.

కరెంట్ షాక్‌తో రైతు మృతి

బాలానగర్, అక్టోబర్ 14 : విద్యుదాఘాతంతో రైతు మృతి చెందాడు. ఈ ఘటన మహబూబ్‌నగర్ జిల్లాలో చోటుచేసుకున్నది. బాలానగర్ మండలం కేతిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన కటిక హరిలాల్ (40) సోమవారం ఉదయం ఆవులను మేపేందుకు సమీపంలోని తన వ్యవసాయ పొలానికి వెళ్లాడు. అక్కడే ఉన్న విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మర్ వైపు ఆవు వెళ్తుండగా.. అదిలించేందుకు అటుగా వెళ్లిన రైతు ప్రమాదవశాత్తు ట్రాన్స్‌ఫార్మర్‌కు సంబంధించిన కేబుల్‌కు తగిలి విద్యుత్తు షాక్‌కుగురై అక్కడికక్కడే మరణించాడు. జడ్చర్ల దవాఖానలో శవపరీక్ష అనంతరం మృతదేహాన్ని కుటుంబీకులకు అప్పగించినట్టు ఎస్సై తిరుపాజీ తెలిపారు.

ఆరు గ్యారెంటీలను అమలు చేయాలని సోనియా, రాహుల్‌కు రాసిన ఉత్తరాలు చూపిస్తున్న ఆదిలాబాద్ జిల్లా ముక్రా(కే) గ్రామస్తులు

ఆరు గ్యారెంటీలపై పోస్ట్‌కార్డ్ పోరు

మొదటిపేజీ తరువాయి...

2,500, రైతు భరోసా పథకం కింద 15 వేలు, వృద్ధాప్య పింఛన్లు 4 వేలు, దివ్యాంగ పింఛన్లు రూ.6 వేలు, కొత్త రేషన్ కార్డులతో పాటు ఇతర పథకాలను వంద రోజుల్లో అమలు చేస్తామని చెప్పిందని, రాష్ట్రంలో అధికారంలో వచ్చి 300 రోజులు గడుస్తున్నా ఆ పథకాలకు అతీగతీ లేదని వారు పేర్కొన్నారు. గ్రామంలో కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారెంటీలకు అర్హులైన వారు చాలా రోజులుగా ఎదురు చూస్తుండగా ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన లేకపోవడంతో గ్రామస్థులు ఆగ్రహంతో వినూత్న నిరసన చేపట్టారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని ఆ ఉత్తరాల్లో డిమాండ్ చేశారు.

బీఆర్‌ఎస్ హయాంలో అవార్డుల పంట

ముక్రా(కే) గ్రామంలో 210 కుటుంబాలు ఉండగా 1080 జనాభా ఉన్నది. వీరంతా వ్యవసాయం చేసుకుంటూ ఉపాధి పొందుతారు. బీఆర్‌ఎస్ పాలనలో ముక్రా (కే) ఆదర్శ గ్రామంగా పలు ప్రశంసలు అందుకున్నది. పదేండ్లలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం ముక్రా(కే)లో రూ.37 కోట్లతో అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలు చేసింది. ప్రతి ఇంటికీ రెండు నుంచి ఆరు పథకాలు తీసుకున్న లబ్ధిదారులు ఉన్నారు. పల్లెప్రగతి ద్వారా సేంద్రియ ఎరువులను తయారీ చేసి రూ.10 లక్షల వరకు ఆదాయం గడించారు. కేంద్ర ప్రభుత్వం నుంచి ఈ గ్రామ పంచాయతీకి పలు అవార్డులు వచ్చాయి. 2020లో స్వచ్ఛ సర్వేక్షన్, 2022లో బయో డైవర్సిటీ, 2022లో దీన్ దయాళ్ స్వశక్తీకరణ్, 2023లో స్వచ్ఛ సజల్ శక్తి సమ్మాన్, 2023లో గ్రామ్ ఉర్జా స్వరాజ్ విశేష్ పంచాయతీ అవార్డులను ముక్రా(కే) సొంతం చేసుకున్నది. రోడ్డుకు ఇరువైపులా స్థానికులు నాటి న మొక్కలతో పచ్చదనం వెల్లివిరుస్తుంది. ముక్రా(కే)లో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న రుణమాఫీ సరిగా అమలు కాలేదు. 221 మంది రైతులకు గాను కేవలం 49 మందికి మాత్రమే రుణమాఫీ వర్తించింది. అర్హులైన అందరికీ రుణమాఫీ వర్తింపచేయాలని ఇటీవల రైతులు సెల్ఫీలు దిగి ముఖ్యమంత్రికి పంపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 300 రోజులు గడుస్తున్నా 6 గ్యారెంటీలను అమలు చేయలేదని మరోసారి నిరసన చేపట్టారు.

ఆరు గ్యారెంటీలు నమ్మి మోసపోయాం

ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారెంటీలను చూసి మోసం పోయాం. **పేదలు పింఛన్లు పెరుగుతాయని, రైతులు రూ.2 లక్షల రుణమాఫీ, రైతుభరోసాలో భాగంగా రూ.15 వేలు, మహిళలు నెలకు రూ.2,500 వస్తాయని ఆశపట్టారు. అధికారంలో వచ్చిన తర్వాత వంద రోజుల్లో ఈ పథకాలు అమలు చేస్తామని చెప్పిన కాంగ్రెస్ నాయకులు మాటమార్చారు. 300 రోజులు గడుస్తున్నా ఈ పథకాలు అమలు కావడం లేదు. మా పంచాయతీలో బీఆర్‌ఎస్ పాలనలో రూ. 37 కోట్లతో అభివృద్ధి సంక్షేమ పథకాలు అమలయ్యాయి. ప్రజలు సంతోషంగా ఉన్నారు. పది నెలల కాంగ్రెస్ పాలనలో పేదలు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పుడు కాంగ్రెస్ నాయకులు ఏమీ చెప్పినా ప్రజలు నమ్మే పరిస్థితులు లేవు.**

- గాడ్గె సుభాష్, మాజీ ఎంపీటీసీ,

కాంగ్రెస్ మోసంపై ముక్రా (కే) ఆగ్రహమే సాక్ష్యం

తెలంగాణ ప్రజల చైతన్యం తెలుసుకో రాహుల్‌గాంధీ: ఎక్స్‌లో కేటీఆర్

హైదరాబాద్, అక్టోబర్ 14 (నమస్తే తెలంగాణ): మాట తప్పితే ప్రజాగ్రహం ఏ స్థాయిలో ఉంటుందో తెలుసుకో అంటూ బీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీకి సూచించారు. అధికారమే పరమావధిగా అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీల అమలు ప్రశ్నార్థకమైందని గ్రహించిన ప్రజలు కాంగ్రెస్ పార్టీపై ఏ స్థాయిలో ఆగ్రహంతో ఉన్నారో చెప్పేందుకు ముక్రా (కే) గ్రామమే నిదర్శమని ఆయన స్పష్టం చేశారు. ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండలం ముక్రా (కే) గ్రామంలో ఆరు గ్యారెంటీలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ప్రజలు 'పోస్ట్‌కార్డు ఉద్యమం' చేపట్టారు. 300 రోజులు దాటినా ఏ ఒక్క హామీని సంపూర్ణంగా పూర్తి చేయలేదని పేర్కొన్నారు. వాటిని తక్షణమే అమలు చేయించాలని రాహుల్‌గాంధీకి లేఖ రాశారు. పోస్టు కార్డులు, ముక్రా (కే) గ్రామస్థుల ఫొటోలను రాహుల్‌గాంధీకి ట్యాగ్ చేస్తూ కాంగ్రెస్ సర్కార్ చేసిన మోసం ప్రజలకు సంపూర్ణంగా తెలిసిపోయింది. కనీసం ఇప్పటికైనా మేల్కొని వాటిని అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

బంగాళాఖాతంలో అల్పపీడనం

హైదరాబాద్, అక్టోబర్ 14 (నమస్తే తెలంగాణ) : తెలంగాణలో రాగల ఐదురోజుల పాటు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. ఆగ్నేయ బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం మంగళవారం ఉదయం వరకు మధ్య బంగాళాఖాతం వరకు చేరుతుందని, ఆ తర్వాత రెండురోజుల్లో తమిళనాడు, పుదుచ్చేరి, దక్షిణ ఏపీ తీరాలకు చేరే అవకాశం ఉందని వెల్లడించింది. మంగళవారం ఉదయం నుంచి బుధవారం వరకు నిర్మల్, నిజామాబాద్, కొత్తగూడెం, ఖమ్మం, నల్లగొండ, సూర్యాపేట, మహబూబాబాద్ , వరంగల్, జనగామ, భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్ , మేడ్చల్ మల్కాజ్‌గిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో వానలు కురుస్తాయని అంచనా వేసింది. ఈ క్రమంలో ఆయా జిల్లాలకు ఎల్లో అలర్ట్‌ని జారీ చేసింది. గడిచిన 24 గంటల్లో పెద్దపల్లి, హనుమకొండ, జయశంకర్-భూపాలపల్లి, ఆదిలాబాద్, వరంగల్ జిల్లాల్లో మోస్తరు వర్షం కురిసినట్టు వాతావరణశాఖ అధికారులు తెలిపారు. పెద్దపల్లి జిల్లా మంథనిలో అత్యధికంగా 5.07 సెం.మీ వర్షపాతం నమోదైంది. హనుమకొండ జిల్లా కాజీపేటలో 4.76 సెం.మీ, హనుమకొండలో 2.14 సెం. మీ, జయశంకర్ భూపాలపల్లి జిల్లా ముత్తారంలో 1.38 సెం.మీ, భద్రాద్రి-కొత్తగూడెం జిల్లా టేకులపల్లిలో 2.44 సెం.మీ చొప్పున వర్షపాతం నమోదైనట్టు వెల్లడించారు.

గల్ఫ్ దేశాల్లో డెలివరీ బాయ్స్ ఉద్యోగాలు

హైదరాబాద్, అక్టోబర్ 14(నమస్తే తెలంగాణ): గల్ఫ్ దేశాల్లో(యూఏఈ) డెలివరీ బాయ్స్ ఉద్యోగాల కోసం ఈ నెల 17న కరీంనగర్ మున్సిపల్ కార్యాలయం వద్దగల శ్వేత హోటల్‌లో ఉదయం 9గంటలనుంచి ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్టు టామ్‌కామ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపింది. ఎస్ఎస్‌సీ ఉత్తీర్ణత, కనీసం మూడేళ్ల సీనియారిటీగల ద్విచక్రవాహన డ్రైవింగ్ లైసెన్స్, పాస్‌పోర్టు, 21-40 సంవత్సరాల మధ్య వయస్కులు అర్హులు. వివరాలకు 9440051285, 9440048500లో సంప్రదించవచ్చు.

బీ ఫార్మసీలో 7,835 సీట్లు

హైదరాబాద్, అక్టోబర్ 14 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలో 7,835 బీ ఫార్మసీ, డీ ఫార్మసీలో 1,449, బయోమెడికల్ కోర్సుల్లో 51, బయోటెక్నాలజీలో 166 సీట్లు ఉన్నాయని టెక్నికల్ ఎడ్యుకేషన్ కమిషనర్ దేవసేన సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.ఈ నెల 19 నుంచి 22 వరకు ప్రవేశ రుసుం చెల్లింపు, స్లాట్ బుకింగ్‌కు అవకాశం ఉందని తెలిపారు. 21నుంచి 23 వరకు సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ఉంటుందని వెల్లడించారు.

కాన్పుకొస్తే నరకయాతన!

- కాన్పు కోసం దవాఖానకు గర్భిణులు
- ఆపరేషన్‌కు సిద్ధం చేసిన సిబ్బంది
- 7 గంటల పాటు లేని మత్తు వైద్యుడు
- ఏరియా దవాఖానాలో దారుణం

హుజూరాబాద్ ఏరియా దవాఖానలో అనస్థీషియా వైద్యుడు లేక గర్భిణుల అవస్థలు

హుజూరాబాద్ టౌన్, అక్టోబర్ 14 : బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో జాతీయస్థాయి అవార్డులు అందుకున్న కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ ఏరియా దవాఖానలో ఇప్పుడు వైద్య సేవలు కునారిల్లుతున్నాయి. ప్రతి నెలా 180 నుంచి 200 కాన్పులు చేసి రికార్డులు సృష్టించిన ఈ దవాఖానకు ఇప్పుడు కాన్పులకు వెళ్లాలంటేనే గర్భిణులు హడలిపోతున్నారు. వైద్యులు అందుబాటులో లేక గంటల తరబడి పురిటి నొప్పులు భరిస్తూ నరకయాతన పడుతున్నారు. అనెస్థీషియా వైద్యుడు అందుబాటులో లేక సోమవారం ఆరుగురు గర్భిణులకు కాన్పులు చేయకపోవడంతో మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 6.30 గంటల వరకు వారంతా నరకం చూశారు. వివిధ గ్రామాలకు చెందిన ఆరుగురు గర్భిణులు సోమవారం ఉదయం 8 గంటలకు దవాఖానకు వచ్చారు. 12 గంటలకు ఆపరేషన్ చేసేందుకు సిబ్బంది అన్ని ఏర్పాట్లు చేశారు. కానీ, మత్తు వైద్యుడు అందుబాటులో లేకపోవడంతో ఆయన వచ్చే వరకు వారు అలానే బెడ్‌పై ఉండాల్సి వచ్చింది. అప్పటికే వారికి యూరిన్ కేథటర్ వేయడం, నొప్పులు పెరగడంతో గర్భిణుల అవస్థలు అన్నీ ఇన్నీకావు. ఏడు గంటల పాటు వారంతా నరకం అనుభవించారు. ఈ క్రమంలో ఓ గర్భిణి తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. మధ్యాహ్నం 3 నుంచి 4 గంటల మధ్య డ్యూటీ డాక్టర్ ఒకసారి వచ్చి పరిస్థితిని చూశారు. మత్తు వైద్యులు లేరని, వచ్చిన తర్వాత ఆపరేషన్లు చేస్తామని చెప్పి వెళ్లిపోయారు. దీంతో గర్భిణుల బంధువులు మీడియాకు సమాచారం ఇచ్చారు. మీడియా అక్కడికి రావడం, బంధువులు ఆందోళనకు దిగితే తప్ప వైద్యుల్లో కదలిక రాలేదు. సాయంత్రం 7 గంటల ప్రాంతంలో మత్తు వైద్యుడిని పిలిపించి రాత్రి 8:30 గంటలకు కాన్పులు చేశారు.

మత్తు వైద్యుడు ఏమైనట్టు?

దవాఖానలో మత్తు వైద్యుడు లేక పోవడంతోనే ఈ పరిస్థితి వచ్చింది. దవాఖానలో మత్తు వైద్యుడిగా పనిచేస్తున్న డాక్టర్ సురేశ్ మధ్యాహ్నం 12 గంటలకు ముందే దవాఖానకు వచ్చినట్టు తెలిసింది. ఆ సమయంలో ఆయన దగ్గరి బంధువులు చనిపోయినట్టు కబురు రావడంతో సెలవు కూడా పెట్టకుండా వెళ్లిపోయినట్టు చెప్తున్నారు.

వైద్యుల తప్పిదం లేదు..

గర్భిణుల విషయంలో వైద్యులు నిర్లక్ష్యంగా వ్యవహరించారన్న వార్తల్లో నిజం లేదని దవాఖాన సూపరింటెండెంట్ రాజేందర్‌రెడ్డి, ఆర్ఎంవో సుధాకర్‌రావు స్పష్టం చేశారు. ఉద్దేశపూర్వకంగానే వైద్యులపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. సుమారు 110 మంది గర్భిణులకు వైద్యులు పరీక్షలు చేశారని, ఆపరేషన్ కోసం ఆరుగురిని అడ్మిట్ చేసుకున్నట్టు చెప్పారు.

గర్భిణుల బాధ వర్ణనాతీతం

వైద్యం కోసం గంటల తరబడి వేచిచూడాలా: హరీశ్ ఆగ్రహం

హైదరాబాద్, అక్టోబర్ 14 (నమస్తే తెలంగాణ): హుజూరాబాద్ ఏరియా దవాఖానలో వైద్యం కోసం గంటల తరబడి గర్భిణులు వేచి చూసిన ఘటనపై మాజీ మంత్రి హరీశ్‌రావు ఎక్స్ వేదికగా స్పందించారు. 'దవాఖానాలోపురిటి నొప్పులతో వైద్యుల కోసం గంటల పాటు ఎదురుచూస్తున్న గర్భిణుల ఆవేదన వర్ణనాతీతం. పేరుకు కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ ఏరియా దవాఖాన. కానీ గైనకాలజిస్టు, అనస్థీషియా వైద్యుడు లేని దారుణ పరిస్థితి. పాలన గాలికి వదిలి, అనునిత్యం రాజకీయాల గురించే మాట్లాడే ముఖ్యమంత్రి గారికి గర్భిణుల ఆవేదనైనా వినపడుతున్నదా? తక్షణమే గర్భిణులకు అవసరమైన అత్యవసర వైద్యం అందించి ప్రాణాలు కాపాడాలని విజ్ఞప్తి చేస్తున్నాం' అని డిమాండ్ చేశారు.

సమస్యను వివరిస్తున్న ములుగు జడ్పీ మాజీ చైర్‌పర్సన్ బడే నాగజ్యోతి

ఎమ్మెల్యే అభ్యర్థికే వైద్యం కరువు

దవాఖానకు వెళ్తే.. రేపు రమ్మన్న వైద్యురాలు

సామాన్యులకు వైద్యంపై నాగజ్యోతి ఆవేదన

సోషల్ మీడియాలో వైరలవుతున్న పోస్టు

ములుగు, అక్టోబర్14 (నమస్తే తెలంగాణ): ఆరోగ్య సమస్యతో సోమవారం రాత్రి ములుగు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ దవాఖానకు వచ్చిన జడ్పీ మాజీ చైర్‌పర్సన్ బడే నాగజ్యోతికి వైద్యం కరువైంది. విధుల్లో ఉన్న డ్యూటీ డాక్టర్ ఈ రోజు చూడబోమని, రేపు రావాలని నిర్లక్ష్యంగా చెప్పారు. దీంతో ఆమె ఆవేదన వ్యక్తంచేస్తూ.. సామాన్య ప్రజలకు అందుతున్న ప్రభుత్వ వైద్యంపై సోషల్ మీడియాలో చేసిన పోస్ట్ వైరల్‌గా మారింది. ఈ సందర్భంగా నాగజ్యోతి మాట్లాడుతూ.. తనకు కుడి చెవి కింది భాగంలో గాలి బుడగలా వచ్చిందని, జ్వరం సైతం వస్తున్నదని ములుగు ప్రభుత్వ దవాఖానకు వచ్చానని తెలిపారు. విధుల్లో ఉన్న వైద్యురాలు భవాని మామూలు జ్వరమే కదా.. అదేమన్న పెద్ద రోగమా? ఇవాళ చూడలేం.. రేపు రమ్మని నిర్లక్ష్యంగా చెప్పిందని వాపోయారు. జడ్పీ చైర్‌పర్సన్‌గా పనిచేసిన తనకే ప్రభుత్వ దవాఖానలో వైద్యం అందకపోతే సామాన్య, పేద ప్రజల పరిస్థితి ఏంటని, ఎలాంటి వైద్యం అందిస్తున్నారని వాపోయారు. వైద్యం కోసం వస్తున్న ప్రజలను చూస్తున్నారా? అనేది అర్థం కావడం లేదని, ఇంత దారుణంగా దవాఖాన నిర్వహణ ఉంటే ఎలా అంటూ ప్రశ్నించారు. దవాఖాన సూపరింటెండెంట్, మంత్రి, మిగిలిన వారు ఏం చేస్తున్నారో అర్థం కావడం లేదని చెప్పారు. దవాఖాన సిబ్బంది కనీస మర్యాద ఇవ్వడం లేదని పేర్కొన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ములుగు ప్రభుత్వ దవాఖానలో వైద్యాన్ని బలోపేతం చేసి సామాన్య ప్రజలకు మెరుగైన వైద్యం అందించేలా చూడాలని నాగజ్యోతి డిమాండ్ చేశారు.